
# మిస్టర్ వెరైటీ

**కెవ్వుమనే పదాన్ని అరడజను సార్లు రిపీట్ చేస్తూ కెవ్వు, కెవ్వుమంటూ అరిచి, సిగ్గుతో మెలికలు తిరిగి పోయాడు చాంగేశ్వరరావు ది గ్రేట్.**



మిస్టర్ వెరైటీ మాత్రం తాపీగా నిదానంగా చిద్విలాసంగా ఓ లాఫ్ లాఫి...

“నువ్వా! చాంగ్ మామా.. రారా.. ఎప్పుడొచ్చావ్? అత్తయ్యవాళ్ళు కులాసాయేనా? అత్తయ్యను కూడా తీసుకురాక పోయావా?” అంటూ కుశల ప్రశ్నల లిస్టు వేశాడు.

“ఇంకా నయం నేను కాబట్టి నా గుండె స్ట్రాంగ్ కాబట్టి బ్రతికిపోయా. మీ అత్తయ్య నిన్నీ వేషంలో చూస్తే అర్ధరాత్రి మిడ్‌నైట్ మసాలా, హారర్ సినిమా ఒకేసారి చూసిన ఎఫెక్ట్‌లో ఝుడుసుకుని గుండాగి చచ్చేది”

మనసులో అనుకుంటూ వీపు చరుచుకున్నాడు.

మిస్టర్ వెరైటీ మాత్రం తన చిద్విలాసాన్ని కంటిన్యూ చేస్తూనే బెడ్రూం వైపు ఓ లుక్కేసి “ఏమోయ్.. మా చాంగ్ మామ వచ్చాడు” అంటూ ఓ అరుపు అరిచేసి తిరిగి చాంగ్ మామ వైపు తిరిగి– చాంగ్‌మామా! నువ్వు మొహం కడుక్కో నేనీలోగా కాఫీ తీసుకు వస్తా” అని కిచెన్ వైపు నడిచాడు.

**సూరేపల్లి విజయ**

ఓసారి వీపు మీద ఘా..ఘా.. అని చరుచుకొని బాత్రూంలోకి నడిచాడు చాంగ్‌మామ అనబడే చాంగేశ్వరరావ్. మొహం కడుక్కుంటోన్నా స్నానం చేస్తోన్నా, టవల్‌తో ఒళ్ళు

తుడుచుకుంటోన్న తన అల్లుడి గెటప్పె కనిపిస్తోంది.

తను తలుపు తట్టగానే అల్లుడు డోర్ తీశాడు. తనప్పుడు ఏం చేశాడు? కెవ్వుమని అరడజను సార్లు అరిచాడు. వై..? లుంగీ కట్టుకోవాల్సిన అల్లుడు పెటీకోట్ కట్టుకున్నాడు. పైగా ఒంటి మీద బనియన్‌కూడా లేదు. తనెంత సిగ్గుపడిపోయాడు? ఎంత కొత్తగా పెళ్ళయితే మాత్రం ఇంత మతిమరుపా? అనుకున్నాడు.

అది మతిమరుపు కాదని తన మతి గతి తప్పడానికి అట్టే టైం పట్టదని, పైన తథాస్తు దేవతలు తథాస్తు అనడానికి వెయిట్ చేస్తున్నారని తెలియదు చాంగేశ్వరరావుకు.

❋ ❋ ❋

కుశల ప్రశ్నలు, కాఫీ తాగడాలు పూర్తయ్యాయి. మిస్టర్ వెరైటీ భార్యను పరిచయం చేసాడు. టిఫిన్ కార్యక్రమాలు కూడా పూర్తయ్యాయి.

మిస్టర్ వెరైటీ తన గదిలోకి వెళ్ళి నిక్కరు వేస్కొని తన షర్ట్‌ని రివర్స్‌లో తొడుక్కుని హాలులోకి వచ్చాడు. మరోసారి చాంగ్‌మామ కెవ్వు కెవ్వుమని అరిచాడు.

"అదేమిటి చాంగ్‌మామా! వచ్చినప్పట్నించీ చూస్తున్నాను. నువ్వు కెవ్వు కెవ్వుమని అరుస్తున్నావేమిటి? వెరయిటీగా మ్యావ్ మ్యావ్ అని అరువు" అని కిచ కిచ నవ్వి "వరల్డ్ ట్రేడ్ సెంటర్ కూలినప్పుడు అమెరికాలో వున్నావా? బిన్‌లాడెన్ డబ్బుల్లేక టీ తాగి బన్ తింటోన్న సీన్ టీవీలో కాని చూసావా? ఝుడుపు, జ్వరం వచ్చినట్టు ఆ అరుపులేమిటి?" అడిగాడు తన డౌట్‌ను క్లారిఫై చేసుకోడానికి మిస్టర్ వెరైటీ.

అప్పుడు రివర్సయి బరస్టయి తననెత్తి మీదున్న అయిదారు వెంట్రుకలు గట్టిగా పీక్కుంటూ అరిచేసి అడిగాడు చాంగ్‌మామ "ఈ నిక్కరేమిట్రా? ఆ షర్టు అలా తిరగేసి వీపు వైపు గుండీలు వచ్చేలా తొడుక్కున్నావేమిట్రా? ఇంకాసేపు వుంటే నాకు మెంటలెక్కేలా వుంది."

"చాంగ్‌మామా.. చాంగ్‌మామా.. యూ నాటీ.. యూ చిలిపి.. యూ చీచీ" అంటూ చాంగ్‌మామ బుగ్గలు బూరెల్లా అయ్యేలా గిల్లాడు మిస్టర్ వెరయిటీ.

మరోసారి పెద్ద కేకేసి "నీ చిలిపితనం తాలిబన్ల డెన్నులో పాతిపెట్ట. నీ గారాబం అమెరికా ప్రెసిడెంట్ వైట్ హౌస్‌లో తగలెట్ట.. బుగ్గలు బూరెల్లా పొంగేలా గిచ్చావు కదరా" ఏడుపు మొహంతో మొత్తుకున్నాడు చాంగేశ్వర్రావ్.

"మరిలేకపోతే ఏంటి చాంగ్‌మామా.. మా ఆఫీసులో అందరూ ప్యాంట్లు, జీన్సు వేసుకొస్తారు. నేను అదే వేసుకుని వెళ్తే వెరైటీ ఏముంటుంది? అందుకే నిక్కరు వేసుకుని ఆఫీసుకు వెళ్తాను. అలాగే అందరూ షర్టు ముందుకేస్కుంటారు. బట్ నేను అలాగే వేసుకుంటే వాటీజ్ వెరయిటీ?" అంటూ ఓ వెర్రినవ్వు నవ్వాడు.

వితిన్ సెకన్స్‌లో మార్నింగ్ తాలూకు ఇన్సిడెంట్ ఫ్లాష్ బ్యాక్‌లో అతని ఫ్రంటుకు వచ్చింది. లుంగీ బదులు వెరైటీ కోసం పెటీకోట్ అన్నమాట.

## ఇదైనా కుదురుతుందో లేదో!

సంజయ్‌దత్ వెంట నదియా దుర్రానీ అనే ఓ ప్రౌఢ కనిపిస్తోంది. ఆరా తీస్తే ఆమె పేరు నదియా దుర్రానీ అని తేలింది. ఓ



పార్టీలో పరిచయమైన ఆమె సంజయదత్‌కి ప్రియురాలిగా మారిందన్నది బాలీవుడ్ ఉవాచ. ఆమెకి తొమ్మిది సంవత్సరాల ఓ కొడుకు కూడా ఉన్నాడట. భర్తతో విడాకులు తీసుకుని ఒంటరిగా ఉన్న ఆమె, సంజయ్‌దత్ జత కోరుకుంటోందట! మన 'ఖల్‌నాయక్' కూడా అందుకు ఒప్పుకున్నాడట!

నవ్వాలో ఏడ్వాలో ఆ సిట్యుయేషన్‌లో అర్థంకాలేదు. ఒక్క క్షణం పిచ్చి చూపులు చూసేసి, వెంటనే ఏం చేయాలో తోచక అల్లుడి గుండెల మీద తలవాల్చి బావురుమని ఏడ్చేసాడు చాంగేశ్వర్రావు.

"ఇదీ.. ఇదీ వెరైటీ అంటే.. ఏడువు చాంగ్ మామా.. బాగా ఏడ్వు. నా గుండెలమీద నీ తలపెట్టి ఏడువు. అబ్బాయి గుండెలమీద అమ్మాయి తల పెట్టి ఏడిస్తే ఏముంటుంది వెరైటీ. ఇది వెరైటీ. కమాన్ ట్రయ్ చాంగ్ మామా" అంటూ ఆనందంతో ఎంకరేజ్ చేసాడు మిస్టర్ వెరయిటీ.

"ఏవండీ మీ చెప్పులు" అంటూ లేడీస్ వేసుకునే హైహీల్స్ అతని పాదాల ముందు పెట్టింది మిసెస్ వెరైటీ.

వెంటనే చాంగ్‌మామకు తన తలను తీసుకు వెళ్ళి హుసేన్‌సాగర్‌లో వున్న బుద్ధ విగ్రహానికేసి కొట్టుకోవాలన్న బలమైన కోరిక పుట్టింది. కానీ మరోసారి టాంక్‌బండ్‌లో బుద్ధ విగ్రహం పడిపోతే బాగోదని ఆ ప్రయత్నం విరమించుకున్నాడు.

మిస్టర్ వెరైటీ మాత్రం దర్పంగా హైహీల్స్‌ని టకటకలాడించుకుంటూ, జేబులో పర్సు బదులు హ్యాండ్ బ్యాగ్‌ని భుజానికి వేసుకొని స్టయిల్‌గా బయటకు నడిచాడు.

క్వయిట్ కామన్‌గా యాజిటీజ్‌గా ఆ రోజు కూడా ఆ వీధి జనం ఈ దృశ్యాన్ని ఎంజాయ్ చేస్తూ బుగ్గలు నొక్కుకుంటూనే వున్నారు.

❋ ❋ ❋

మిస్టర్ వెరైటీ ఆఫీసుకు వెళ్ళగానే చాంగేశ్వర్రావ్ సోఫాలో కూచుని ఓ గంటసేపు నాన్‌స్టాప్‌గా ఏడ్చేశాడు.

"ఇదేమిటమ్మా.. మీ ఆయన్ని చూస్తే నాకు మెంటలెక్కి పోతోంది" అంటూ అరగంటన్నర అనగా నలభై అయిదు నిమిషాలసేపు ఏడ్చేసి మిసెస్ వెరైటీని అడిగేశాడు.

"ఏం చెప్పమంటావు చాంగు బాబాయ్.. నా బ్రతుకు మీ అల్లుడ్ని కట్టుకున్నాక ఒసామా బిన్ లాడెన్‌లా అయింది. పెళ్ళయినప్పట్నుంచీ ఇదే తంతు. ఈయన వన్నెలు, చిన్నెలు చూళ్లేక ఛస్తున్నాను. ఏమైనా అంటే వెరైటీ అంటాడు.

పెళ్ళికి ముందు ఎవడో దురదానంద స్వామి చెప్పాడట. పెళ్ళయ్యాక ఇలా వెరైటీగా ప్రవర్తిస్తే కలిసొస్తుందని, ఆ దురదానంద స్వామికి అయిదు వేలు తగలేసి ఇలా తయారయ్యాడు.

ఫస్ట్‌నైట్ రోజే నాకు మెంటలెక్కింది. ఒక్కసారి కళ్ళు మూస్కోండి. నేను ఫ్లాష్‌బ్యాక్ చెబుతా" అంది మిసెస్ వెరైటీ.

కళ్ళు మూసుకున్నాడు చాంగేశ్వర్రావు.

❋ ❋ ❋

"నాన్‌సెన్స్.. ఫస్ట్‌నైటేంటి అసహ్యంగా, ఫస్ట్ ఆఫ్టర్‌నూన్ అరేంజ్ చెయ్యండి. నాకు

వెరైటీ అంటేే యిష్టం." చెప్పాడు మామగారితో మిస్టర్ వెరైటీ.

"అలా కాదు.. కూడదల్లుడూ" అని మామగారు ఎంత చెప్పినా వినకుండా మిట్ట మధ్యాహ్నం శోభనం జరిపించేసుకున్నాడు.

స్కూటర్ కొనిస్తానంటే తనకు ఆటో కావాలని అదైతే వెరైటీగా వుంటుందని కొనిపించుకున్నాడు.

రోజూ అదే ఆటోలో ఆఫీసుకు వెళ్తాడు.

❋ ❋ ❋

"అదీ చాంగ్ బాబాయ్ మా ఫస్ట్‌నైట్ ఫ్లాష్ బ్యాక్. ఆ తర్వాత మీ అల్లుడి వెరైటీ పిచ్చితో నాకు సగం మెంటలెక్కింది. ఆటోలో సినిమాకు వెళ్తే అందరూ విచిత్రంగా చూస్తారు. ఏయ్ ఆటో వస్తావా? అని కూడా అడిగారు.

అందరూ మార్నింగ్ వాక్ చేస్తే ఈయన మిడ్‌నైట్ వాక్ చేస్తారు. అదీ వెనక్కే నడుచుకుంటూ.

లుంగీ కన్నా, నా లంగా వెరైటీ అంటారు. అందర్లా నేను చెప్పులేసుకోను అని హైహీల్స్ వేస్కుంటారు. ఇంత కన్నా నీచ నికృష్టమైన వెరైటీ ఇంకేముంటుంది." చెప్పుకుపోతోంది మిసెస్ వెరయిటీ.

కానీ పది నిమిషాల క్రితమే మిస్టర్ వెరైటీ, వెరైటీ లీలలు విన్లేక వెనక్కి విరుచుకు పడిపోయాడు చాంగేశ్వరరావు.

❋ ❋ ❋

ఇలాంటిలాంటి వెరైటీ పనులు చేస్తాడు కాబట్టే అతనికి మిస్టర్ వెరైటీ అన్న పేరు ఆటోమేటిగ్గా వచ్చేసింది. ఆఫీసులో కూడా అలానే పిలుస్తారు. కుర్చీలో కూచుంటే వెరైటీ వుండదని నేల మీద కూచుని ఫైల్స్ చూస్తాడు. అతని వెరైటీ చేష్టలు చూళ్ళేక, మేనేజర్‌కు మెంటలెక్కితే, మరో మేనేజరుకు హార్ట్ ఎటాక్ వచ్చి, దురదృష్టం స్లిప్పయి బ్రతికిపోయాడు.

❋ ❋ ❋

చాంగేశ్వరరావ్ మూడ్రోజులు మూడున్నర కేజీలు తగ్గాడు. అందరూ గడ్డం నున్నగా గీస్కుంటే, అందులో వెరైటీ ఏముందని చాంగ్ మామ చేత సగం గడ్డం చేయించాడు. సగం గడ్డంతో అదో టైప్‌లా వున్నాడు చాంగ్‌మామ. రాత్రిపూట లుంగీ బదులు, లంగా కట్టుకోమంటాడు. తనలా హైహీల్స్ వేసుకోమంటాడు. ఓ అర్ధరాత్రి చాంగేశ్వరరావ్ ఎవరికీ చెప్పా పెట్టకుండా ఇల్లొదలి పారిపోయాడు.

ఆ రోజు రాత్రి మొగుడి తిక్క చేష్టలకు ఫుల్‌స్టాప్ పెట్టాలని డిసైడయిపోయింది మిసెస్ వెరైటీ.

❋ ❋ ❋

మిస్టర్ వెరైటీ మొహం కడుక్కొని టీ కప్పు నోట్లో పెట్టుకొని, షాకయ్యాడు. టీలో కారం, మిక్సయి షేకైపోయాడు.

ఇదేమిటని అడిగితే తాపీగా చెప్పింది మిసెస్ "వెరైటీ.. వెరైటీ..టీ" అని.

దంగైపోయాడు మిస్టర్ వెరైటీ.

మధ్యాహ్నం లంచ్‌లోకి తుప్పట్టిన మేకులతో తయారుచేసిన మేకుల రసం తయారు చేసింది. జామకాయలతో కర్రీ వండింది. యాపిల్‌తో పలావ్ చేసింది.

ఇదేమిటని అడిగితే సింపుల్‌గా చెప్పింది వె..రై..టీ..అని.

రాత్రి పాలకు బదుల ఫినాయిల్ గ్లాసులో పోసి యిచ్చింది. వెరైటీకి పరాకాష్టగా.

వారం రోజులు గడిచాయి.

## మెదడుకు మేత - 32

మీ జి.కె. పవర్ ఎంత ఉందో పరీక్షించి చూసుకోండి. ఈ క్రింద ఇచ్చిన ఐదు ప్రశ్నలకు సమాధానాలు క్రింది కూపన్‌లో వ్రాసి 'మెదడుకు మేత', ఎడిటర్, ప్రియదత్త, ఆంధ్ర ప్రచురణ ప్రైవేట్ లిమిటెడ్, 103/1, లజ్ చర్చిరోడ్, మైలాపూర్, చెన్నయ్ - 600 004 చిరునామాకు ఈ పత్రిక విడుదలైన 10 రోజుల్లోగా అందేలా పంపండి.

మా వద్ద గల కీ సొల్యూషన్స్‌తో సరిపడే ఆల్ కరెక్ట్‌గా రాసిన ఐదుగురు విజేతలకు ఒక్కొక్కరికి మూడు నెలల పాటు ప్రియదత్త వారపత్రికను పోస్టు ద్వారా ఉచితంగా పంపిస్తాము. విజేతలు ఐదుగురికన్నా ఎక్కువ మంది ఉంటే, లాటరీ పద్ధతిన ఎంపిక చేయడం జరుగుతుంది.

మీ సమాధానాలు క్రింద ఇచ్చిన కూపన్‌లో మాత్రమే పూర్తి చేసి, మీ చిరునామా వివరాలు నింపి, కవరులో పెట్టి మాకు పంపించాలి.

**1. గురుత్వాకర్షణ శక్తిని కనుగొని, దానిపై ప్రయోగాలు చేసిన శాస్త్రవేత్త ఎవరు?**

**2. ప్రపంచంలో మొత్తం దేశాలెన్ని?**

**3. తెలుగు ఏ ద్రావిడ భాష?**

**4. 1988లో ఇరాక్‌లోని హాలబ్జాలో వేలమంది కుర్దులను బలిగొన్న రసాయనిక దాడికి ప్రధాన సూత్రధారి ఎవరు?**

**5. ఇండియాలో అతి పెద్ద, అత్యంత ఖరీదైన నగరం ఏది?**

*1-09-04 సంచిక మెదడుకు మేత-29 సమాధానాలు 1.బ్రహ్మపుత్ర 2. పరశురాముడు 3. అమ్జాద్ అలీఖాన్ 4. కలకత్తా 1855 5. మిల్కాసింగ్.*

*ఆల్ కరెక్టుగా సమాధానాలు రాసినవారు ఎమ్. విజయభారతి, గన్నవరం. వీరికి ప్రియదత్త 3 నెలల పాటు పంపబడును.*

**- ఎడిటర్**

### మెదడుకు మేత - 32 కూపన్

**సమాధానాలు**

1. ..............................................................
2. ..............................................................
3. ..............................................................
4. ..............................................................
5. ..............................................................

పేరు : ..............................................................

చిరునామా : ..............................................................

..............................................................

.............................................. పిన్‌కోడ్ : ..............................

నాలుగన్నర కేజీలు తగ్గాడు మిస్టర్ వెరైటీ.

కూరల్లో షుగరు, కాఫీలో కారం, ఉప్పు యిలా కాక్‌టెయిల్ చేసి తనకు పుడ్డు మీద విరక్తి కలిగేలా చేస్తోంది.

ఆ రోజు ఫ్రెండ్స్‌ని ఇంటికి ఇన్వయిట్ చేసాడు. మా ఆవిడ్ని పరిచయం చేస్తానని చెప్పి గదిలోకి వెళ్ళి భార్యను పిలిచాడు.

"వస్తున్నా పదండి" అంది మిసెస్ వెరైటీ.

బిక్కచచ్చి బల్లిలా గోడకు అతుక్కుపోయిన ఎక్స్‌ప్రెషనిచ్చి అడిగాడు యిలానా? అని.

పెటీకోట్ బ్లౌస్‌తో వుంది.

"అవును.. అందర్లా చీర కట్టుకొని వస్తే ఏముంటుంది వెరైటీ"

నెత్తీ నోరూ మొత్తుకున్నాడు మిస్టర్ వెరైటీ. రెండు చేతులెత్తి దండం పెట్టి బ్రతిమలాడి చీర కట్టించి భార్యను ఫ్రెండ్స్‌కు పరిచయం చేశాడు.

❋ ❋ ❋

పదిహేన్రోజులైంది.

ఏడున్నర కేజీలు తగ్గాడు. తను వెరైటీ పేరుతో చేసిన పనులవల్ల తన భార్య ఎంత ఫీలయిందో? మెల్లమెల్లగా అర్థమవసాగింది. ఆ రోజు రొమాంటిక్ యాంగిల్‌తో కూడా ఫినిషింగ్ టచ్ యిచ్చేసింది మిసెస్ వెరైటీ తన మొగుడుగారైన మిస్టర్ వెరైటీకి.

❋ ❋ ❋

"ఏమండీ" గోముగా పిలిచింది.

"ఏమిటి డాలింగ్" అడిగాడు మిస్టర్ వెరైటీ.

"రోజూ మీరేనా.. వెరైటీ ఏముంటుంది.. అందుకని వెరైటీగా.."

ఆ తర్వాత ఆమె మాటలు వినిపించలేదు. బుర్ర గిర్రున తిరిగిపోయింది.

రెండు చేతులతో నాలుగుసార్లు లెంపలు వేసుకొని తన వెరైటీ చేష్టలను క్షమించమని మళ్ళీ ఎప్పుడు ఇలాంటి పిచ్చి పనులు చేయనని చెప్పి రాజీకి వచ్చి సైలంటయ్యాడు.

ఆ రోజు నుంచి తన వెరైటీ పిచ్చి చేష్టలకు స్వస్తి చెప్పాడు.

దానికి మరో కొసమెరుపు ఏమిటంటే డబ్బుకోసం తనలాంటి భక్తులను ఇలా పక్కదారి లేదా పిచ్చిదారి పట్టించే దురదానంద స్వామిని ఓ రోజు అర్ధరాత్రి ఢిల్లీలో బ్రహ్మానందం టైపు గెటప్‌లో వెళ్ళి చితకబాది వచ్చాడు.

దేర్ ఎండ్స్ ద మ్యాటర్. ఇప్పుడు మిస్టర్ వెరైటీ ఇంట్లో నో వర్రీస్..ఆల్ హేపీస్. ❋




ఎడమ నుంచి కుడికి - ఎస్. సత్యనారాయణ, కె. రాఘవులు, గుడిమెట్ల చెన్నయ్య, మల్లాది సచ్చిదానందమూర్తి, గూడపాటి శ్రీనివాసరావు, డా. నిర్మలా పళనివేలు

## ఘనంగా 'జనని' వార్షికోత్సవ వేడుకలు

'జనని' సాంఘిక సాంస్కృతిక సమితి 11వ వార్షికోత్సవ వేడుకలు చెన్నై, మైలాపూర్‌లోని అమరజీవి పొట్టిశ్రీరాములు స్మారక మందిరంలో ఆగస్టు 28వ తేదీ సాయంత్రం ఘనంగా జరిగాయి. ముందుగా సాయిశర్వాణి, సాయిశ్రీవాణి ప్రార్థనాగీతం ఆలపించారు. అనంతరం 'జనని' ఉపాధ్యక్షులు శ్రీ సి.సుధాకరరెడ్డి తన స్వాగతోపన్యాసంలో 'జనని' తెలుగుభాషకే కాక, సామాజిక సాంస్కృతిక సేవ కూడా చేస్తోందని తెలియజేశారు.

సభాధ్యక్షులుగా వ్యవహరించిన సమితి ప్రధాన కార్యదర్శి గుడిమెట్ల చెన్నయ్య మాట్లాడుతూ ప్రభుత్వాల నిర్లక్ష్యం వల్ల తమిళనాట తెలుగు భాష క్షీణిస్తోందని, దీనిని అరికట్టాల్సిన బాధ్యత తెలుగువారందరిపై ఉందన్నారు. ముఖ్య అతిథి ఎమ్.ఎస్.ఎమ్ గ్రూప్ అధినేత మల్లాది సచ్చిదానందమూర్తి జనని 11వ వార్షికోత్సవ ప్రత్యేక సంచికను విడుదల చేసి, ప్రథమ ప్రతిని చెన్నై టెలిఫోన్స్ మాజీ డి.జి.ఎమ్., సాహితీవేత్త గూడపాటి శ్రీనివాసరావుకి అందజేశారు. అనంతరం ఆయన ప్రసంగంలో "ఒక చిన్న పద్యంలోనే చక్కటి శబ్ద, భావ సౌందర్యాలు కూర్చగల ఘనత తెలుగువారిదనీ, ఏ భాషా పదాలనైనా తెలుగు, తనలో ఇముడ్చుకోగలదని" అన్నారు. "స్పష్టంగా పలకటానికి అన్ని రకాల అక్షరాలతో, ఎక్కువ అక్షరాలు తెలుగులో ఉన్నాయని" తెలుగు భాష గొప్పదనాన్ని కొనియాడారు.

'ఎవరు ఎన్ని భాషలు నేర్చినా మాతృభాషలోనే ఆలోచిస్తారని, ఆంధ్రత్వమనిన ఆత్మతత్వ మెరుగుటేనని చెబుతూ తెలుగు భాష గొప్పదనాన్ని సోదాహరణంగా వివరించారు. ఆంధ్రులుగా జన్మించినందుకు గర్వపడాలంటూ జనని చేస్తున్న సంస్కృతీ, భాష, సమాజసేవలను కొనియాడారు. తదనంతరం ప్రసంగించిన జనని అధ్యక్షురాలు డా॥ నిర్మలాపళనివేలు తన ప్రసంగంలో తెలుగు భాష ఉత్కృష్టతను తెలియజేస్తూ దేశంలో ఎక్కువమంది మాట్లాడే భాష తెలుగేనన్నారు.

ప్లస్‌టు తెలుగులో అత్యధిక మార్కులు పొందిన త్రిపుర సుందరికి రూ. 1000 లు నగదు బహుమతిని మల్లాది సచ్చిదానందమూర్తి అందజేశారు. అనంతరం జరిగిన సాంస్కృతిక కార్యక్రమంలో 'కమ్మనైన తెలుగుపాట"ను ఎస్.సత్యనారాయణ అతిమధురంగా ఆలపించగా, ఐ.ఒ.బి. సీనియర్ మేనేజర్ కె.రాఘవులు 'శ్రీకృష్ణ రాయబారం'లోని పద్యాలను భావ, రాగ యుక్తంగా ఆలపించి సభికులను సమ్మోహనపరచారు. చిన్నారులైన కె.ఎల్.సుధాకర్, ఎం.గాయత్రి పాటలు, పద్యాలు చక్కగా ఆలపించారు. వి.రవితేజ, వి.అన్నపూర్ణ శ్లోకాలను, పద్యాలను పాడి సభికుల మన్ననలు పొందారు. మద్రాసు తెలుగు అభ్యుదయ సమాజ వ్యవస్థాపక కార్యదర్శి పేరిశెట్ల భాస్కరుడు వందన సమర్పణ చేయడంతో కార్యక్రమం ముగిసింది. ❋